06ATP29_06ATP29.qxd 29-01-2024 PM 11:20 Page 1



## రేపటి పౌరుల బంగారు భవిష్యత్తు కోసం ఆలోచించే నాయకుడు మన చంద్రబాబు

- మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి



బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**శెట్టూరు, జనవరి 29 ప్రభాతవార్త**

రేపటి పౌరుల బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు ఆలోచించే నాయకుడు చంద్రబాబు అని, అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లగా సుపరిపాలన అందించేందుకు విజనరీ లీడర్ చంద్రబాబు ఆలోచనల రూపంలో బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలు సోమవారం వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఉన్నం వరలక్ష్మిలు బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే జూన్ నెల నుంచి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. కాబట్టి మ నమంతా సైకిల్ గుర్తుకు ఓటేసి అత్యదిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు ఆర్.జి.శివశంకర్, మాజీ మండల కన్వీనర్ గురుప్రసాద్, మాజీ మండల కన్వీనర్ తిప్పారెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి రంగప్ప, వడ్డే యల్లప్ప, వడ్డే శ్రీనివాసులు, శేఖ్యానాయక్, మారుతి, వీరాంజినేయుల, ప్రభాకర్, చలమేష్, రెడ్డప్ప, మంజునాథ్, హనుమంతరాయుడు, మాజీ డీలర్ వీరాంజినేయులు, తిలక్, భీమన్న, కరియన్న, గంగన్న, గంగాధర, వెంకటేషులు, సతీష్, మహిళలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాధితులకు పరామర్శ.. ఆర్థిక సాయం అందజేత

- నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వరనాయుడు



చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న ఉమా మహేశ్వరనాయుడు

**కళ్యాణదుర్గం టౌన్, జనవరి 29 ప్రభాతవార్త**

గ్యాస్ ఏజెన్సీల నిర్లక్ష్యంతోనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని క ళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వరనాయుడు అన్నారు. సోమవారం కుందుర్పి మండలం తెనగల్లులో ఉదయం ఓ ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి గాయపడ్డ 6 మంది బాధితులను కళ్యాణదుర్గం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. సంఘటన వివరాలను బాధితులతో అడిగి తెలుసకుని చంద్రన్న స్పూర్తితో ఉమన్న ఆర్థిక సాయం ఇరవై వేలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గ్యాస్ ప్రమాదాలు పెద్ద ఎత్తున సంభవిస్తున్న సంబంధిత అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదని విమర్శించారు.తాజాగా కుందుర్పి మండలం తెనగల్లులో గ్యాస్ సిలెండర్ పేలి 6 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదంతా సంబంధిత ఏజెన్సీలు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యపు ధోరణితోనే జరుగుతున్నాయన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తేదేపా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగుభూమి పట్టాలు ఇచ్చే వరకు పోరాటం ఆపం


**పుట్టపర్తిటౌన్, జనవరి 29, ప్రభాతవార్త**



కలెక్టరేట్ ముందు బైఠాయించి భూ నిర్వాశితులు

భూములు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. సోమవారం హిందూపురం, పాలసముద్రం, చిలమత్తూరు, కొడికొండ చెక్‌పోస్టు తదితర ప్రాంతాల నుండి భూములు కోల్పోయిన రైతులు గణేష్ సర్కిల్ నుండి గోకులం మీదుగా ర్యాలీ చేస్తూ ఇంటి పట్టాలు ఇవ్వాలని, లేని పక్షంలో తమ పోరాటం ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాలసముద్రం సమీపంలో నాసిన్, బెల్ పరిశ్రమలకు చవకగా దళితుల భూములను ప్రభుత్వం లాక్కుందని మండిపడ్డారు. ఆర్ఆర్ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, సరైన నష్టపరిహారం అందించాలని, హైకోర్టు ఆదేశించిందన్నారు. పేదలకు పరిహారం అందించడంలో ఒక న్యాయం, ధనికులకు మరొక న్యాయమా? అని ప్రశ్నించారు. పేదల పక్షాన పోరాడాల్సిన టిడిపి,జనసేన పార్టీలు అధికారం కోసం ఆరాపటడుతున్నాయే తప్ప పేదలకష్టాలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చివరికి జాయింట్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ బయటకు వచ్చి 10 రోజులలోపు ఇంటి పట్టాలు, భూ నిర్వాశితులకు న్యాయమైన పరిహారంపై విచారించి న్యాయం చేస్తామని ఇచ్చి హామీతో ఆందోళనకారులు శాంతించారు. ఈ సమస్యను ఫిబ్రవరి 20వ తేది లోపు పరిష్కరించకుంటే నిరవధిక దీక్షలు చేపడతామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, గంగాధర్, నారాయణ, వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నుంచి తేదేపాలోకి చేరిక



తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

**గుడిబండ, జనవరి 29 ప్రభాతవార్త**

గుడిబండ మండల పరిధిలోని మద్దనకుంట,మందలపల్లి, తాళ్లకెర సింగేపల్లి గ్రామాల నుంచి చాలా మంది వైకాపా నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. గుడిబండ మండల కేంద్రంలో నిర్వహించిన జయహో బిసి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప మైనార్టీ అధ్యక్షులు షబ్బీర , కొత్తచెరువు మండల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వందలాది మంది వైకాపా పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మడకశిర ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమర్తిలు వారికి కండువా కప్పి తేదేపాలోకి ఆహ్వానించారు. మాజీ ఉప సర్పంచు మూడ్ల గిరియప్ప, ఈరముద్దప్ప, దర్శన్, తిప్పేస్వామి, రంగనాథ్, కేశవరెడ్డి, నవీన్, శివన్న,సిద్దప్ప తదితరులు తేదేపాలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, బూదిపల్లి జయరామప్ప, వెంకటేష్, ఐటిడిపి ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, చిత్ర శేఖర్, రంగాయాదవ్, రామచంద్ర, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీని ఆదరించండి



ప్రచారం నిర్వహిస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి....

**బొమ్మనహాళ్, జనవరి 29 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైయస్ఆర్ పార్టీని ప్రజలందరూ ఆదరించి ఆశీర్వదించాలని నియోజకవర్గం సమన్వయ కర్త మెట్టు గోవిందరెడ్డి కుమారుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వైసిపి నాయకులతో కలిసి గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఉన్న వైసీపీ నాయకులు ఆయనన్ను ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆయన గడపగడపకు వెళ్లి వైయస్ఆర్‌సిపిని ప్రతి ఒక్కరు ఆదర్శించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్ను కోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని, ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి వాటిని అమలు పరిచారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పనులను చేశాడని ఆయన పేర్కొన్నారు. కావున రాష్ట్రంలో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మెట్టు గోవిందరెడ్డిని ప్రజలు ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్, ఎంపిటిసి, వైస్ ఎంపిపి, జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, వైస్ సర్పంచులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే రైతు రక్షణ వేదిక ధ్యేయం

**రాయదుర్గం, జనవరి 29 ప్రభాతవార్త**



రైతులతో మాట్లాడుతున్న న్యాయవాది ప్రతాప్‌రెడ్డి

రైతుల సమస్యల కోసం పోరాడటానికి మరియు సాగునీటి సాధన కోసం రాయదుర్గంలో రైతు రక్షణ వేదిక అనే సంఘాన్ని స్థాపించామని సామాజిక కార్యకర్త, న్యాయవాధి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బొమ్మక్కపల్లి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న ఆటుపోట్లు, కష్టనష్టాలపై మరియు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్‌బికెల నుండి వారికి న్యాయంగా అందాల్సిన సహాయం గురించి చర్చించినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల క్రితం చర్చకు వచ్చిన జీడిపల్లి రిజర్వాయర్ నుండి నీటిని తెచ్చి పైపులైన్ల ద్వారా బొమ్మక్కపల్లి చెరువుకు నింపాలనే ప్రతిపాదన ముందుకు సాగలేదని పేర్కొన్నారు. సాగునీటి పారుదల అధికారులతో ఈ విషయంపై చర్చించేందుకు ప్రయత్నించినా అందుబాటులో లేకపోవడం వల్ల నిరాశ చెందినట్లు తెలిపారు. బొమ్మక్కపల్లి చెరువుకు నీరు వస్తే చుట్టు ప్రక్కల కొన్ని వందల ఎకరాలకు సాగునీరు అందడమేకాక భూగర్భ జలాలు రీచార్జ్‌అయ్యి బోర్లు సంవృద్ధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు. రైతులు అంతా ఒక్కటిగా నిలబడి సాగునీటిని సాధించేందుకు పోరాటం చేస్తే తప్పా ఫలితం దక్కదని తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి రైతులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని రైతులను కోరారు.

## రైతు కింద పడి వ్యక్తి ఆత్మహత్యయత్నం

**రాయదుర్గం, జనవరి 29 ప్రభాతవార్త:**



ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన మల్లికార్జున

పట్టణంలోని సిద్దేశ్వర కాలనీకి చెందిన మల్లికార్జున(39) అనే వ్యక్తి సోమవారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నంచాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సిద్దేశ్వర కాలనీకి చెందిన మల్లికార్జున పట్టణ సమీపంలోని బళ్లారిరోడ్డులో ఉన్న లక్ష్మినరసింహస్వామి ఆర్చ్ ఎదురుగా ఉన్న రైలు పట్టాల వద్ద వస్తున్న గ్యాడ్స్ కింద పడి ఆత్మహత్యా యత్నంకు ప్రయత్నించాడన్నారు. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు పూర్తిగా నుజ్జునుజ్జైయ్యాయి. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యయత్నంకు ప్రయత్నించినట్లు బాధితుడు పేర్కొన్నారు. రైలు డ్రైవర్ రైలును ఆపి అతన్ని బయటికి తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతనికి పరీక్షలు నిర్వహించి అనంతపురంకు తరలించినట్లు తెలిపారు.

## పిఎఫ్ బకాయి చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలి





నిరసన తెలుపుతున్న కార్మికులు

**కణేకల్లు, జనవరి 29 ప్రభాతవార్త**

ప్రావిడెంట్ ఫండ్ ప్రాంతీయ కార్యాలయం కడప నందు సోమవారం ఏపిఆర్‌డబ్లుఎస్ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపిన కమీషనర్‌కు మెమొరాండం ఇవ్వడం జరిగింది. అనంతపురం జిల్లాలో శ్రీ నీలకంతాపురం శ్రీరామ్‌రెడ్డి వాటర్ ప్రాజెక్టు నందు రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం పీఏబిఆర్‌హెడ్ వర్క్ నందు సుమారు 600మంది కార్మికులు 15సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు. పనిచేస్తున్నటువంటి కార్మికులకు వేతనంతో పాటు పిఎఫ్ చెల్లించాలని చట్టం ఉన్నప్పటికి 2022ఏప్రిల్ నుండి కాంట్రాక్టర్ శివారెడ్డి తొమ్మిది నెలలుగా పిఎఫ్ కట్టలేదు. మరియు 2021-22సంవత్సరాలకు గాను కాంట్రాక్టర్ కలం నాయుడు ఐదు నెలల పిఎఫ్ కట్టలేదు. కాంట్రాకస్టర్లు కుమ్మకు కావడం వల్ల కాంట్రాక్టర్లపై ఎస్ఈ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిని నిరసిస్తూ కడప పట్టణంలో ఉన్నటువంటి ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం నందు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ ప్రావిడెంట్ ఫండ్ ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ కన్వీనర్ జి.ఓబులు, కడప జిల్లా సిఐటియు కార్యదర్శి అధ్యక్షులు కామ్రేడ్ మనోహర, మెడికల్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వెంకటసుబ్బయ్య, అనంతపురం జిల్లా శాఖ అధ్యక్షులు ఎర్రిస్వామి, జిల్లా కార్యదర్శి రాము, ఉపాధ్యక్షులు ప్రబాకర్, జిల్లా యూనియన్ ట్రెజరర్ వన్నూరుస్వామి, జిల్లా యూనియన్ కమిటి సభ్యులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మనహాళ్ ఎస్సైగా వి.శ్రీనివాసులు

**బొమ్మనహాళ్, జనవరి 29 ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్లో ఎస్సైగా వి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూల్ జిల్లా హొలిగుంద మండలం నుండి బొమ్మనహాళ్‌కు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రత పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలు తెలియజేయాలన్నారు. మండలంలో ఉన్న గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఎవరైనా కర్ణాటక నుండి అక్రమంగా మద్యం తరలిస్తే వారిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

## హామీ పత్రాలిచ్చి పట్టాలివ్వకుండా మోసం చేస్తున్నారు..!

- తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన బాధిత లబ్దిదారులు - ఆందోళనకు నాయకత్వం వహించిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

**ఉరవకొండ, జనవరి 29 ప్రభాతవార్త**

భూమి కోర్టు కేసులో ఉందని పరిష్కారం కాగానే పట్టాలిచ్చి స్థలాలు చూపుతామని చెప్పి తమకు ప్రభుత్వం హామీ పత్రాలిచ్చి మూడేళ్ళు గడిచిపోయి మళ్లీ ఇప్పుడు ఎన్నికలొస్తున్నా ఇప్పటివరకు మాకు పట్టాలివ్వలేదని నిరశిస్తూ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన బాధిత లబ్దిదారులు మండల తహశీల్దార్ కార్యాలయంను సోమవారం ముట్టడించారు. అధికార వైసీపీ నాయకులు, మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు పి.నిరంజన్‌గౌడ్, మాజీ వార్డు సభ్యుడు సుద్దల వెంకటేశ్వర్లు యాదవ్, ఇతర నాయకుల నయకత్వంలో తరలివచ్చిన లబ్దిదారులు కార్యాలయ ప్రధాన ద్వారం మూయించి అక్కడే బైటాయించి తమకు హామీ పత్రాల స్థానంలో పట్టాలిచ్చి స్థలాలు చూపేంతవరకు కదిలేది లేదని భీష్మించారు. ఈ సందర్భంగా పి.నిరంజన్‌గౌడ్ మాట్లాడుతూ భూమి కోర్టులో ఉందని నాడు లబ్దిదారులకు భరోసా కల్పించడానికి ప్రభుత్వం హామీ పత్రాలు ఇచ్చిందన్నారు. ఇటీవల 560 లబ్దిదారులకు సంబంధించిన భూమికి పరిహారం సమస్యకు కోర్టులో పరిష్కారం లభించడంతో అధికారులు ఇటీవల ఒకసారి 240 మందికి, మరొకమారు 300 మందికి పట్టాలిచ్చిచ్చారని ఈ లెక్కన హామీ పత్రాలు పొందిన వారు కేవలం 20 మంది మాత్రమే మిగిలిపోవాల్సి ఉండగా వాస్తవానికి 9,10 తదితర వార్డుల్లో పట్టాలందని హామీ పత్రాలున్న లబ్దిదారులు దాదాపు 200 నుంచి 240 మందికి పైచీలకు ఉన్నారన్నారు. కోర్టు కేసు పరిష్కారం అయినపుడు వీరికి కాకుండా కొందరు నాయకులు సూచించిన వారికి పట్టాలిచ్చి నిజంగా హామీ పత్రాలు పొందిన వారికి అధికారులు తీరని అన్యాయం



ధర్నాలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు పి.నిరంజన్‌గౌడ్

చేశారన్నారు. అధికారులు అన్నీ తెలిసే అక్రమాలను ప్రోత్సహించారని హామీ పత్రాలున్న లబ్దిదారులకు న్యాయం జరిగేంత వరకు కదిలేది లేదని పట్టుబట్టారు. ఈక్రమంలోనే తహశీల్దార్ జి.శ్రీధరమూర్తి అక్కడికి చేరుకొని ఆందోళనకారులు, నాయకత్వం వహించిన వారితో మాట్లాడి తనకు హామీపత్రాల జిరాక్సు ప్రతులు అందించాలని వెరిఫైచేసి నిజంగా అర్హులైతే న్యాయం జరిగేలా చూస్తానని ఇందుకు కొంత సమయం పడుతుందన్నారు. ప్రతిగా స్పందించిన లబ్దిదారులు మాయమాటలుచెప్పి మభ్యపెట్టవద్దని రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే న్యాయం కోసం కోర్టును ఆశ్రయించడంతోపాటు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేసి తహశీల్దార్‌కు హామీపత్రాల జిరాక్స్ కాపీలతో కూడిన వినతిపత్రాలు అందించి ఆందోళన విరమించారు.

## మున్సిపల్ కమిషనర్‌గా పి.వెంకటరమణయ్య




**గుంతకల్లు టౌన్, జనవరి 29 ప్రభాతవార్త**

గుంతకల్లు మున్సిపల్ నూతన కమీషనర్‌గా పి.వెంకటరమణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరు పంచాయతీరాజ్ శాఖలో డిఎల్‌డిఒగా పనిచేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కమీషనర్ మల్లికార్జున ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు.

## విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయసేకరణ

**గుత్తి, జనవరి 29 ప్రభాతవార్త**



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న ఇఇ

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ చార్జీలపై విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో చేపట్టిన ప్రజాభి ప్రాయ సేకరణ సోమవారం స్థానిక ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటీవ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఇఇ రాజశేఖర్ పర్యవేక్షణలో ఈ కార్య క్రమం కొనసాగింది. అయితే ప్రజలు ముందుగానే తమ పేరు నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. నియంత్రణ మండలి చైర్మన్ నాగార్జునరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్య క్రమం చేపట్టారు. ఫిబ్రవరి 1 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఇఇ తెలిపారు.

## గ్యాస్ పేలుడుతో ఉలిక్కపడ్డ తెనగల్లు

- ఆరుగురికి గాయాలు ఇద్దరి పరిస్థితి విషమం

**కుందుర్పి, జనవరి 29 ప్రభాతవార్త**



గ్యాస్ పేలుడులోని పలు దృశ్యాలు

కుందుర్పి మండలం తెనగల్లు గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. తెనగల్లు గ్రామంలో ఉదయం ముస్తఫా ఇంట్లో సిలిండర్ పేలి ధ్వంసం అవటంతో ఇరుగు పొరుగున్న వారు పెద్ద శబ్దం విని ప్రమాదం జరిగిందని అక్కడికి చేరుకున్నారు. వెంటనే మరో సిలిండర్ పేలిందని దీంతో ప్రమాద తీవ్రతపై ఆరుగురు గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన సిద్దేశ్వర కాలిన గాయాలతో పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిం చాలని వైద్యులు సూచించారు. ఈయనతో పాటు భీమ్‌రాజ్ తలకు కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు చౌడన్న, నారాయణస్వామి, రామాంజినేయులు, మారుతిలు కూడా ఈ ప్రమాదంలో గాయపడగా ఘటన స్థలాన్ని అడిషనల్ ఎస్పీ జయరాంరెడ్డి, కళ్యాణదుర్గం డిఎస్పి శ్రీనివాసులు, రూరల్ సిఐ నాగరాజు, స్థానిక సభ్యులు వెంకట్‌స్వామి ఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితులను పరిశీలించారు.

## అంగన్‌వాడీలకు దేవాలయంలో సమావేశం.. ఒక భవనం లేని వైనం



దేవాలయంలో జరుగుతున్న సమావేశం

**అగళి, జనవరి 29 ప్రభాతవార్త**

ప్రతి సెక్టార్ మీటింగ్‌తోపాటు, అత్యవసర సమావేశాలు శిక్షణ కార్యక్రమాలు లాంటివి మండలంలోని అంగన్‌వాడీ ఆయాలు కార్యకర్తలు ప్రతి నెలా సమావేశం అవుతారు. ప్రభుత్వం అంగన్‌వాడీల హితాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు మండల కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించడానికి ఒక భవనం కూడా నిర్మించలేకపోవడంతో వారు దేవాలయాల్లో సమావేశాన్ని నిర్వహించు కోవాల్సిన పరిస్థితి ఎన్ని ప్రభుత్వాలు మారినా అంగన్‌వాడీలకు ఒక సమావేశ భవనం లేకపోవడంతో ఆలయాల్లో సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. సోమ వారం కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆవరణంలో అంగన్‌వాడీలు సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రాబోయే రోజుల్లోనైనా ప్రతి మండలానికి వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఒకప్రత్యేక భవనాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 31న చెరువు, చింత ఫలసాయం వేలం పాట

**అగళి, జనవరి 29 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అగళి చింత తోపు ఫలసాయం వేలం పాటను 31వ తేది 10:30 గంటలకు అగళి సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు పంచాయితీ కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. అదే విధంగా అగళి చెరువులో చేపలు పెంపకానికి కూడా వేలం పాటను అదే రోజు నిర్వహించనున్నట్లు తెలిపారు. చెరువు వేలం పాటలో పాల్గొనే వేలం దారుడు 5వేల రూపాయల డిపాజిట్ చెల్లించాలని, అదే చింత ఫలసాయం వేలం పాటలో పాల్గొనేవారు 3వేల రూపాయలు డిపాజిట్‌ను చెల్లించాలన్నారు. వేలం పాట పూర్తి అయిన వెంటనే వేలం ధరలో 50 శాతం చెల్లించాలని కార్యదర్శి తెలిపారు.

## అనారోగ్యంతో అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా చైర్మెన్ టి.రాజశేఖరరెడ్డి కన్నుమూత

-నేడు స్వగ్రామం కమడలపాడులో జరుగనున్న అంత్యక్రియలు

**ఉరవకొండ, జనవరి 29 ప్రభాతవార్త**



తేనేటి రాజశేఖర్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా చైర్మెన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, వజ్రకరూరు మండలం కమలపాడు గ్రామానికి చెందిన తేనేటి రాజశేఖర్‌రెడ్డి (68) సోమవారం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆయన గత కొంతకాలంగా బెంగళూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున 2 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. 1956 జూలై 10న జన్మించిన రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ఆ తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా ఎదిగారు. ఆయన సతీమణి శైలజ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్న సమయంలో 2006 నుండి 2011 వరకు వజ్రకరూరు మండల ఎంపీపీగా పనిచేశారు. రాజశేఖర్‌రెడ్డి సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి 2022లో అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా చైర్మెన్‌గా బాధ్యతలు అప్పగించగా ఆయన సమర్థవంతంగా నిర్వహిస్తూ వచ్చారు. ఆయనకు ఇద్దరు కుమారులు సంతానం కాగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామైన కమలపాడు తీసుకొచ్చారు. మంగళవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి మరణంపై స్థానిక మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## రైతులకు పరిహారం చెల్లించాలి

-తహశీల్దార్‌కు వినతిపత్రం అందించిన సీపీఎం నాయకులు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

**ఉరవకొండ, జనవరి 29 ప్రభాతవార్త**

ప్రభుత్వం గత ఖరీఫ్, రబీ పంట కాలాల్లో పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు 50వేల రూపాయలు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, ఉపాధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, అదనంగా 200 రోజులు పనులు కల్పించాలని, రోజుకు 600 రూపాయలు వేతనం అందించాలని సీపీఎం నాయకులు ఎ.రంగారెడ్డి. బి.బాలరంగయ్య కోరారు. సోమవారం వారు స్థానిక మండల తహశీల్దార్ జి.శ్రీధరమూర్తికు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ రైతులు వర్షాభావంవల్ల వేరుశెనగ, జొన్న, మొక్కజొన్న, పత్తి, కంది, ఆముదం పంటలు నష్టపోయారన్నారు. హెచ్ఎల్‌సీ, హంద్రీనీవా కింద సాగైన పంటలకు పంట పూర్తీ అయ్యేవరకు నీరు అందకపోవడంతో వరి, మిరప పంటలు నష్టపోయారని వారికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల గూర్చి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామని ఈనెల 23న ఉరవకొండకు వచ్చిన సీయం జగన్మోహన్‌రెడ్డి ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. నియోజకవర్గంలో సాగైన పంటలు నిలువకు శీతల గిడ్డంగులను, కొనగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.వెంకటేశులు, యం.నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు సక్రమంగా వినియోగించుకోండి

-ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ, మానవహారం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జనవరి 29 ప్రభాతవార్త**

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రతిఒక్కరూ ఓటు హక్కును సక్రమమైన పద్దతిలో వినియోగించుకోవాలని మహాత్మ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం.బసవరాజు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డా॥కె.కె.ప్రసాద్, సీనియర్ అధ్యాపకులు సంపత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమన్న అన్నారు. ఉరవకొండ మహాత్మా డిగ్రీ, జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో మండల పరిధిలోని లత్తవరం, లత్తవరం తండాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేపట్టిన ప్రత్యేక శిబిరాలు సోమవారం 5వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వలంటీర్లు ఓటర్లకు అవగాహన సదస్సు, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. నిర్భయంగా, నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకుంటామని ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సత్యనారాయణ, సంపత్, స్థానిక ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తి మృతి

**గుత్తి, జనవరి 29 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలోని బండగేరికి చెంది నాగేంద్ర (60) అనే వ్యక్తి గాయపడి చికిత్స పొందుతూ సోమవారం కర్నూల్ ఆసుపత్రిలో మృతి చెందాడు. ఆయన నాలుగు రోజుల క్రితం ఇంటిలో మెట్లపై నుండి ప్రమాదవశాత్తు జారి కిందపడి గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

